
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 20 ఫిబ్రవరి 2024

రాష్ట్రంలో నియంతృత్వ పాలనపై జర్నలిస్టులు భగ్గుమన్నారు. అధికార పార్టీ మూక దాడిపై మండిపడ్డారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై పెనుదాడిని ఖండిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాత్రికేయులు నిరసన తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బెజవాడలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ వద్ద సోమవారం ప్రదర్శన చేశారు. దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. బందరులో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



మూక దాడిపై ఆగ్రహ జ్వాల

విజయవాడలో నిరసన ప్రదర్శన



బందరులో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

ఫొటో జర్నలిస్టుపై దాడి అమానుషం!

- 6లో..

బంగారం కాజేసి అజ్ఞాతంలోకి..

గంగూరు యూబీఐ మేనేజర్‌కు బిగుస్తున్న ఉచ్చు

- ఇంకా పరారీలోనే ప్రభావతి
- గాలిస్తున్న ప్రత్యేక బృందాలు
- సస్పెండ్ చేసిన జోనల్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దావులూరి ప్రభావతి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చని భావించిన ప్రభావతి పరారీలో ఉన్నారు. కవులూరి యోగేశ్వరరావు అనే ఖాతాదారుడు రుణం పూర్తిగా చెల్లించినా ఆయన తాకట్టు పెట్టిన 380 గ్రాముల బంగారం తిరిగి ఇవ్వలేదు. దీనిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

గతంలోనూ ఇంతే..

ప్రభావతి లోగడ చేసిన వ్యవహారాలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. యోగేశ్వరరావు పోలీసులను ఆశ్రయించడానికి ముందు బ్యాంకు జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జోనల్ కార్యాలయం నుంచి మూడు ప్రత్యేక బృందాలు గంగూరులోని బ్రాంచ్‌లో మూడు రోజుల పాటు సోదాలు నిర్వహించాయి. అన్ని ఫైళ్లను పరిశీలించగా, యోగేశ్వరరావు చేసిన ఫిర్యాదులో వాస్తవముందని నిర్ధారించారు. జోనల్ అధికారులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖాతాదారుడికి సంబంధించిన బంగారాన్ని మాయం చేయడంలో ప్రభావతి పాత్ర ఉందని తేలడంతో ఆమెను సస్పెండ్ చేశారు. బ్యాంకు సిబ్బంది గానీ, అధికారులు గానీ ప్రభావతికి అనుకూలంగా వ్యవహరించకపోతే వారిపై వేధింపులకు దిగేవారన్న విమర్శలు వస్తున్నాయి. జుజ్జూరులో ఉన్న బ్రాంచ్‌లో కొన్నాళ్ల క్రితం ప్రభావతి క్లర్క్ హోదాలో పనిచేశారు. అప్పటి వరకు పనిచేసిన మేనేజర్ ఆమెకు అనుకూలంగా వ్యవహరించేవారని సమాచారం. తర్వాత ఆయన్ను బదిలీ చేయడంతో కొత్త మేనేజర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభావతి ఆడే ఆటలకు ఆయన చెక్ పెట్టడంతో ఆ బ్రాంచ్ మేనేజర్‌పై తిరుగుబాటు చేశారు. లేనిపోని ఫిర్యాదులు చేసి ఆయనను నానా తంటాలు పెట్టినట్టు యూబీఐ వర్గాలు చెప్పుకొంటున్నాయి.

అసలేం జరిగింది?

నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావుతో ప్రభావతికి పరిచయం ఉంది. ఖాతాలు తెరవడంలో బ్రాంచ్ మేనేజర్లకు ప్రతినెలా టార్గెట్లు విధిస్తారు. దీనిని పూర్తి చేసుకునే క్రమంలో బ్యాంకులో ఖాతా తెరవమని కోరారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన ఖాతాను యోగేశ్వరరావు గంగూరు శాఖకు బదిలీ చేయించుకున్నారు. ఆయన వద్ద ఉన్న 380 గ్రాముల బంగారాన్ని భద్రపరుచుకోవడానికి లాకర్ కావాలని అడిగారు. దానికి ఆమె ఒక కథ అల్లారు. లాకరులో బంగారం దాచుకోవడం కంటే దానిపై రుణం తీసుకోవచ్చు కదా.. అని సలహా ఇచ్చారు. దీంతో ఆయన బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నారు. గడిచిన ఏడాది నవంబరులో రుణం చెల్లించినా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను ఆయనకు ఇవ్వలేదు. దీనిపై పలుమార్లు ఆయన ప్రభావతిని అడిగినా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీరవిధేయులకూ మొండిచేయేనా..?





కొడాలి నాని, వల్లభనేని వంశీకి సీట్లు డౌటే..!

గన్నవరం సిటింగ్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, గుడివాడ సిటింగ్ ఎమ్మెల్యే కొడాలి నాని.. సీఎం జగన్‌కు వీరవిధేయత చూపడంలో తిరుగులేనివారు. అంతటి వీరవిధేయులకు వచ్చే ఎన్నికల్లో జగన్ హ్యాండ్ ఇస్తారా..? ఎన్నికల వేళ మారుతున్న రాజకీయాలు ఈ ప్రశ్నకు అవుననే సమాధానాన్నే ఇస్తున్నాయి. వైసీపీ అభ్యర్థి మండల హనుమంతరావు అంటూ సోమవారం గుడివాడలో ఫ్లెక్సీలు ప్రత్యక్షం కాగా, ఇక టీడీపీ నుంచి వైసీపీ తీర్థం పుచ్చుకోనున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు గన్నవరం సీటు ఇస్తారంటూ ప్రచారం జోరందుకోవడంతో కొడాలి నాని, వల్లభనేని వంశీ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

- గుడివాడలో తెరపైకి మండల హనుమంతరావు పేరు
- వైసీపీ అభ్యర్థి అంటూ ఫ్లెక్సీల ఏర్పాటు
- సీఎంను కలిసిన టీడీపీ నేత ముద్దరబోయిన
- గన్నవరం నుంచి బరిలోకి దించే యోచన
- కాపు, బీసీ ఓటుబ్యాంకు కోసం వైసీపీ కీలక మార్పులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో పామర్రు, గుడివాడ, గన్నవరం మినహా మిగిలిన అన్ని సీట్లకు అభ్యర్థులను వైసీపీ ఖరారు చేసింది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము, అవనిగడ్డ నుంచి సింహాద్రి చంద్రశేఖర్ తనయుడు రాంచరణ్, పెనమలూరు నుంచి జోగి రమేశ్ పేర్లను ప్రకటించారు. వీరిలో పేర్ని కిట్టు, సింహాద్రి రాంచరణ్ కాపు సామాజికవర్గానికి చెందినవారు. ఉప్పాల రాము, జోగి రమేశ్ గౌడ సామాజికవర్గానికి చెందినవారు. గుడివాడ, గన్నవరం నుంచి కొడాలి నాని, వల్లభనేని వంశీకి టికెట్లు ఇస్తే కమ్మ సామాజికవర్గానికి రెండు స్థానాలు ఇచ్చినట్లవుతుంది. కానీ, ఈసారి బీసీలకు పెద్దపీట వేస్తామంటున్న వైసీపీ అధిష్ఠానం వారికి ఎక్కువ సీట్లు కేటాయించే అంశంపై దృష్టిపెట్టింది. కమ్మ సామాజికవర్గానికి ఇచ్చినా వారు ఓట్లు ఎటూ వైసీపీకి పడవన్న ఉద్దేశంతో ఈ రెండు స్థానాల్లో ఒకటి యాదవ సామాజిక వర్గానికి, ఒకటి కాపు సామాజికవర్గానికి కేటాయించే దిశగా ఆలోచన చేస్తోంది. ఇదే జరిగితే ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాన్ని మినహాయిస్తే కృష్ణాజిల్లాలో కాపులకు 3 స్థానాలు, బీసీలకు 3 స్థానాలు ఇచ్చినట్లవుతుంది. వైసీపీపై అసంతృప్తితో ఉన్న కాపులను ఆకర్షించడానికి, జిల్లాలో పవన్ కల్యాణ్ ప్రభావాన్ని తగ్గించడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని వైసీపీ పెద్దలు ఆలోచన చేస్తున్నారు. బీసీలకు మూడు స్థానాలు ఇవ్వడం ద్వారా వారికి పెద్దపీట వేశామని ప్రచారం చేసుకోవచ్చన్న ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉన్నారు.



వైసీపీ అభ్యర్థి అంటూ గుడివాడలో హనుమంతరావు పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వంశీ పోటీలో ఉంటారా? నానీకి సీటు ఇస్తారా?

వల్లభనేని వంశీకి గన్నవరం టికెట్ ఇవ్వని పక్షంలో ఆయన్ను ఎక్కడి నుంచి బరిలోకి దింపుతారన్న చర్చ వైసీపీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది. ఈనెల 12న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీతో కలిసి వంశీ సీఎం జగన్‌ను కలిశారు. వంశీ సీటు విషయంపై చర్చించేందుకే ఈ భేటీ జరిగినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ భేటీలో వంశీని పెనమలూరు నుంచి కానీ, మైలవరం నుంచి కానీ పోటీ చేయించాలని వైసీపీ పెద్దలు నిర్ణయించి సిద్ధమవ్వాల్సిందిగా చెప్పినట్లు సమాచారం. మరి ఈ రెండు స్థానాల్లో ఒక దాని నుంచి వంశీ బరిలో ఉంటారా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఇక కొడాలి నానీని ఎక్కడి నుంచి పోటీ చేయిస్తారన్నది ఉత్కంఠగా ఉంది. గుడివాడ నుంచి కాపులకు అవకాశం ఇచ్చే పక్షంలో నానీని ఈసారికి ఎన్నికలకు దూరం పెడతారా? లేక వేరే స్థానం కేటాయిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

సామాజిక సమీకరణాలపైనే వైసీపీ దృష్టి

గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చడం ద్వారా తాము విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నామని ప్రచారం చేసుకునేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో బీసీల ఓట్లు సుమారు లక్ష ఉంటాయి. వీటిలో యాదవ సామాజికవర్గానికి సుమారు 40 వేల ఓటుబ్యాంకు ఉంటుంది. దీన్ని లక్ష్యంగా చేసుకుని గన్నవరంలో బీసీ కార్డుతో బరిలోకి దిగాలన్నది వైసీపీ ఆలోచన. గుడివాడలో బీసీలకు దీటుగా కాపు ఓటు బ్యాంకు ఉంది. బీసీ ఓటు బ్యాంకు 80 వేలు ఉంటే, కాపులు 40 వేల పైచిలుకు ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ కాపు కార్డు ప్రయోగించాలని భావిస్తోంది. ముద్దరబోయిన 2004లో గన్నవరంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1999, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక గుడివాడలో తెరపైకి వచ్చిన మండల హనుమంతరావు ఆడిటర్‌గా సుపరిచితులు.

అభివృద్ధికి రాజకీయ గ్రహణం!



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న చల్లపల్లి మసీదు కమిటీ సభ్యులు

ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరైనా పరిపాలన అనుమతి రాకుండా వైసీపీ పెద్దల అడ్డు

- అవనిగడ్డ నియోజకవర్గానికి పాకిన జాడ్యం
- కలెక్టర్‌కు విన్నవించుకున్న చల్లపల్లి మసీదు పెద్దలు

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తన ఎంపీ లాడ్స్ నుంచి విడుదల చేసిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా అడ్డుకునే ఆనవాయితీని అవనిగడ్డలో కూడా వైసీపీ పెద్దలు అమలు చేస్తున్నారు. 2022లో మచిలీపట్నం నియోజకవర్గంలో మసీదులో అభివృద్ధి పనులకు ఎంపీ ల్యాడ్స్ రూ.25 లక్షలు విడుదల చేస్తే వాటితో పనులు చేయకుండా మచిలీపట్నం నియోజకవర్గం వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దీన్ని మరువకముందే అవనిగడ్డ నియోజకవర్గంలోనూ షాదీఖానా నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ మంజూరైనా, పరిపాలనా అనుమతి రాకుండా వైసీపీ పెద్దలు అడ్డుకున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లిలోని మసీదు ఆవరణలో షాదీఖానా భవనంపై మొదటి అంతస్తు నిర్మాణం కోసం ఎంపీ వల్లభనేని బాలశౌరి తన నిధుల నుంచి రూ.15 లక్షలు విడుదల చేస్తూ 2023 మార్చి 21వ తేదీన కలెక్టర్‌కు లేఖ ఇచ్చారు. ఈ పనులకు సంబంధించి ఏమైనా ఇబ్బందులున్నా, తిరస్కరించినా 75 రోజుల్లోగా తనకు సమాచారం పంపాలని లేఖలో పేర్కొన్నారు. ఈ భవనం నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులూ లేకపోవడంతో పంచాయతీరాజ్ విభాగం అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను జిల్లా ప్రణాళికా విభాగం అధికారులకు పంపారు. అయినా ఈ భవనం నిర్మాణానికి అనుమతులు రాలేదు. దీంతో చల్లపల్లి మసీదు కమిటీ పెద్దలు సీపీవో కార్యాలయ అధికారుల చుట్టూ కొన్ని నెలలుగా తిరుగుతూనే ఉన్నారు. ఈ పనులకు కలెక్టర్ నుంచి ఎలాంటి పరిపాలనా ఆమోదం లభించలేదని, కొంతకాలం వేచి చూడాలని సీపీవో కార్యాలయ అధికారులు చెబుతూ వచ్చారు.

కావాలనే అడ్డుకున్నారు

స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన అనంతరం చల్లపల్లి మసీదు కమిటీ సభ్యులు షేక్ ససీమ్‌గౌరి, ఇతర సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ తమ అభ్యర్థన మేరకు ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులు విడుదల చేసినా, నియోజకవర్గస్థాయి వైసీపీ పెద్దలు అధికారులపై ఒత్తిడి తెచ్చి పరిపాలనా ఆమోదం పొందకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. ఎన్నాళ్ల నుంచో మసీదు ఆవరణలోని షాదీఖానా, ఇతరత్రా అభివృద్ధి పనులు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఎంపీ స్పందించి నిధులు మంజూరు చేస్తే, స్థానిక వైసీపీ పెద్దలు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టర్ వాస్తవాలను గ్రహించి షాదీఖానా అభివృద్ధి పనులకు పరిపాలనా ఆమోదం తెలపాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ముస్లిం పెద్దలు

చలపల్లి మసీదు ఆవరణలో షాదీఖానా భవనం అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంలో రాజకీయకోణం ఇమిడి ఉండటంతో చల్లపల్లి ముస్లిం పెద్దలు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందించారు. నిధుల మంజూరుకు అనుమతులు ఇచ్చి ఏడాది కావస్తున్నా ఇంతవరకు పరిపాలనా ఆమోదం ఇవ్వలేదని, త్వరితగతిని ఇవ్వాలని కోరారు.



పల్లకిలో ఊరేగుతున్న అమ్మవారు

వైభవంగా వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 : ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్ల సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి గండదీపాలు ఇచ్చేందుకు భక్తులు పోటెత్తారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసుల పసుపు కుంకుమ, చీర సారె అందుకున్న తరువాత రావిచెట్టు సెంటర్‌లో మెట్టినింటి నుంచి మేళ తాళాలు, డప్పువాయిద్యాలు, దీపాలంకరణతో పల్లకిలో బయలుదేరిన అమ్మవారు వేలాది మంది భక్తుల గండ దీపాలు అందుకుంది. తిరుగుగండ దీపాల భక్తులు వెంటరాగా పురవీధుల్లో ఊరేగేందుకు తరలివెళ్లారు. తిరునాళ్లకు బయలుదేరిన అమ్మవారికి గండదీపాల మొక్కుబడి చెల్లించేందుకు వచ్చిన భక్తులతో పట్టణ రహదారులు కిక్కిరిసి జనసంద్రంలా కన్పించాయి. ఆలయ కమిటీ సభ్యులు ఆలయం నుంచి అమ్మవారిని బయటకు తీసుకువచ్చి పల్లకిలో ఉంచారు. కమిటీ సభ్యులు, సీడీసీ ఛైర్మన్ రాజులపాటి రామచంద్రరావుతో కలిసి పల్లకిని ఎత్తి ఊరేగింపు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ పల్లకిలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి గండదీపాలు ఇచ్చేందుకు తరలివచ్చిన భక్తులు

డ్వాక్రా గ్రూపులకు బుక్ కీపర్ వేధింపులు

- లంచం ఇస్తేనే రుణం మంజూరు చేస్తానంటున్న బుక్ కీపర్
- చర్యలు కోరుతూ అవనిగడ్డలో డ్వాక్రా మహిళల ధర్నా

- 6లో..



బావిశెట్టి భాను కుమారులకు చదువు నిమిత్తం నగదు అందజేస్తున్న బుద్దా భూలక్ష్మి

భాను కుటుంబానికి అండగా ఉంటా

» రూ. 25 లక్షలతో ఇల్లు కొనిస్తా.. దాతృత్వం చాటిన బుద్దా వెంకన్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : ఇటీవల హఠాన్మరణం చెందిన తన అనుచరుడు బావిశెట్టి భాను కుటుంబానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న భూరి విరాళాన్ని ప్రకటించారు. గత 30 సంవత్సరాలుగా తన అనుచరుడిగా కుటుంబసభ్యుల్లో ఒకడిగా ఉన్న భాను ఇటీవల ఆకస్మిక మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. అతడి కుటుంబానికి అండగా ఉంటానని, సుమారు రూ.25 లక్షలు వ్యయం చేసే ఇల్లు కొనిస్తానని దాతృత్వాన్ని చాటుకున్నారు. తనతో పాటు ఉండే అనుచరుల విషయంలో ఎప్పుడూ ఇదే తీరున స్పందిస్తానన్నారు. ఇంజనీరింగ్ చదువుతున్న భాను పిల్లలకు మూడో సంవత్సరం ఫీజు, జీవనం కోసం రూ. 4 లక్షల నగదును బుద్దా వెంకన్న సతీమణి భూలక్ష్మి సోమవారం అందజేశారు.

వైసీపీ నుంచి గెలిచేది ఐదుగురే..

» నలుగురు పాడె మోసేందుకు, ఒకరు కుండ పట్టేందుకు : నెట్టెం



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురే గెలుస్తారని, నలుగురు వైసీపీ పాడె మోసేందుకు, ఒకరు కుండ పట్టేందుకు అంటూ మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఘాటుగా స్పందించారు. 'ఫ్యాన్‌గాలి ప్రజలను తప్పుదోవ పట్టిస్తాది.. సైకిల్ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటాది.. గ్లాసు చల్లని నీటిని ప్రజలకు అందిస్తు చల్లగా చూసుకుంటాది..' అంటూ నెట్టెం చమత్కరించారు. రాప్తాడు సభలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సోమవారం తన నివాసంలో ఘాటుగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి మూలన పడేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా అని ఎదురుచూస్తున్నారన్నారు. లిక్కర్, మైన్స్, శ్యాండ్‌తో అందినకాడికి దోచుకుని తాడేపల్లి బొక్కసాన్ని వేలకోట్లతో నింపుకోవటమే పనిగా పెట్టుకుని పేదలు, పెత్తందార్లు అంటూ మాట్లాడటానికి జగన్‌కు సిగ్గులేదా అని నెట్టెం ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నేత ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

విజయవాడ రూరల్ : తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి అనేక మంది ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పి. నైనవరం గ్రామాలకు చెందిన వైసీపీ పార్టీ నేతలు టీడీపీలో చేరారు. అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య, వార్డ్ మెంబరు మడ్డపల్లి వసంత్ కుమార్, దొండపాటి హరీష్, నైనవరం గ్రామ నాయకులు ధూళిపాళ దేవేంద్ర, నిమ్మగడ్డ చిన్నా, చాపిరి శ్రీనివాసరావు, పందూరి నూకరాజు, పెయ్యల రవి, సతులూరి సురేష్, కోటేశ్వరరావు, ఆలూరి సతీష్, ధూళిపాళ నాని, చీదీరాల శివలకు యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, ప్రధాన కార్యదర్శి కోనేరు సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావు, తెలుగు రైతు కార్యదర్శి గరిమెళ్ల నరేంద్ర చౌదరి, తెలుగు యువత అధ్యక్షుడు పరుచూరి నరేష్, అడుసుమిల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి వేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో, ఎవరిపాలనలో విధ్వంసం జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనంతపురం సభలో బూటకపు ప్రసంగాలు చేశారని, తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో.. ఎవరి పాలన రాతియుగమో తేల్చేద్దామన్నారు. ఓటమి భయంతో ఎమ్మెల్యేల స్థానాలను మారుస్తున్నారన్నారు. ఐదేళ్ల విధ్వంసపాలనలో అధికార దుర్వినియోగంతో ప్రజలను మోసం చేశారన్నారు. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లో ఆర్టీసీ బస్సులతో పాటు స్కూలు బస్సులు కూడా బలవంతంగా తీసుకెళ్లి జనాలను తరలించారన్నారు. రానున్న ఎన్నికలు పెత్తందారి జగన్‌కు ఐదుకోట్ల ప్రజలకు మధ్య జరిగే యుద్ధమన్నారు. సమావేశంలో టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, బచ్చుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రైతులు, వైద్యులతో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాడిరైతుల సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యం

» కృష్ణామిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, ఫిబ్రవరి 19 : పాడి రైతుల సంక్షేమం, ఆరోగ్యానికి కృష్ణామిల్క్ యూనియన్ ప్రాధాన్యత నిస్తుందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. అమెరికన్ గ్యాస్ట్రో కేర్ ఆసుపత్రి సహకారంతో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రిలో పాడి రైతులకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లివర్ సంబంధిత వ్యాధుల గురించి తెలుసుకునేందుకు అత్యాధునిక ఫైబ్రో స్కాన్‌ను రైతులకు ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చిన ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అట్లూరి శ్రీదేవికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పాడిరైతుల కుటుంబాలలో మహిళలకు కూడా ఉచితంగా స్కానింగ్ చేసేందుకు ఆమె సమ్మతించారన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పాడి రైతులు, యూనియన్ అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి : కలెక్టర్ రాజాబాబు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగేశ్వరనాయక్, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచకుండా, నిర్దీత గడువులోగా పరిష్కరించాలన్నారు. 118అర్జీలను వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, డీఎస్‌వో పార్వతి, డీఈవో తాహెరా సుల్తానా వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌పై అధికారులతో సమీక్ష

ఉయ్యూరు డివిజన్‌లో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌లను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఉయ్యూరు డివిజన్ అధికారులతో సోమవారం తనచాంబరులో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో 79శాతం మేర ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మిగిలిన రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తిచేయాలన్నారు.



ఫొటో జర్నలిస్టుపై దాడి
అమానుషం

» ప్రభుత్వ తీరును ఖండించిన పలు పార్టీల నేతలు

'రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా.. వైసీపీ రౌడీ మూకల దాడిపై పోలీసులు తక్షణం స్పందించాలి. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టుల పైనా దాడులు పెరిగాయి. రాప్తాడు ఘటనపై డీజీపీ తక్షణం స్పందించి నిందితుల అరెస్టుకు చర్యలు తీసుకోవాలి..' అంటూ పలు పార్టీల ప్రతినిధులు, ప్రముఖులు స్పందించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిని వారు తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

- కొనకళ్ల నారాయణ (మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు)



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సభా కార్యక్రమాల కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి ప్రజాస్వామ్యానికే పెనుముప్పు. పత్రికా రంగంలో పనిచేస్తున్న ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లపై అధికారం ఉంది కదా అని వైసీపీ నాయకులు ఇలా దాడులు జరిపించడం సిగ్గుచేటు.

సూర్య కాంతిని అరచేతితో ఆపలేరు

- కొల్లు రవీంద్ర (మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు)



నిజాలు నిర్భయంగా రాస్తున్న ఆంధ్రజ్యోతి విలేఖరులు, ఫొటోగ్రాఫర్లపై వైసీపీ గూండాలు దాడులు జరపడం సిగ్గుచేటు. పాత్రికేయులపై దాడులు జరిపితే తగిన చర్యలు తీసుకోవచ్చని ఇటీవల సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ సభకు జనాలు రాలేదని చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడులు జరపడం అమానుష చర్య. ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. దాడులకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

మీడియాపై దాడి హేయమైన చర్య

- దేవినేని ఉమా (మాజీమంత్రి)



ఇబ్రహీంపట్నం : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి హేయమైన చర్య. దుర్మార్గుడు, ఫ్యాక్షన్ మనస్తత్వం ఉన్న వ్యక్తికి అధికారం ఇస్తే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు. జర్నలిస్టులపై గుండాలు దాడి చేస్తున్నాంటే ఒకప్పటి బీహార్ గురించి ఇప్పుడు ఏపీ గురించి జనం చెప్పుకుంటున్నారు. విలేకర్లపై దాడి చేసే హీనస్థితికి జగన్మోహన్ రెడ్డి దిగజారిపోయాడు. బాధిత కుటుంబాలు స్టార్ క్యాంపెనర్లుగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ రెడ్డిని బంగాళాఖాతంలో కలిపేందుకు 160 అడుగుల లోతు గొయ్యిలో పాతిపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

వైసీపీ అరాచకానికి పరాకాష్ట

- మండలి బుద్ధప్రసాద్ (మాజీ ఉపసభాపతి)



అవనిగడ్డ : రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో వైసీపీ మూకలు చేసిన దాడి ఆ పార్టీ అరాచకానికి పరాకాష్ఠ. రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న నైరాశ్యం నుంచి పుట్టిన అసహనంతో వైసీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడి అయినా తమ దారిలోకి తెచ్చుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. నచ్చని వార్తలు ఇస్తున్నారన్న ఆక్రోశంతో దాడులకు పాల్పడటం ప్రభుత్వానికి తగదు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చట్టాలు పెట్టి కేసు నమోదు చేయాలి.

దాడి దుర్మార్గం

- అడ్డాడ ప్రసాద్‌బాబు (సీపీఐ జిల్లా నేత)



చల్లపల్లి : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడటం దుర్మార్గం. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయి. నిందితులను కఠినంగా శిక్షించాలి. వైసీపీ అరాచక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

హేయమైన చర్య..

- కొండవీటి సునీత (ఉమ్మడి కృష్ణా జనసేన కార్యదర్శి)



కోడూరు : జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య. రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఫొటో కవరేజ్‌కు వెళ్లిన సీనియర్ జర్నలిస్టుపై దాడి చేయటం దారుణం. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఆళ్ల గోపాలకృష్ణ (సాగు నీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు)



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంతో సమానం. వీధి రౌడీల్లా మీడియాపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి.

అరాచక పాలనకు తార్కాణం

- మూల్పూరి సాయికళ్యాణి (తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి)



నిజాల్ని నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై రాప్తాడు సభలో ముఖ్యమంత్రి సమక్షంలో దాడి చేయడం అరాచకపాలనకు నిదర్శనం. జగన్ అధికారంలోకి వచ్చాక మీడియాపై దాడులు పెరిగిపోయాయి. జగన్ సభలకు ఆయన కూలి మీడియా తప్ప మిగిలిన వారు వెళితే నిజాలు బయటపడతాయని భయం. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యానికే మచ్చ..

- బండి రామకృష్ణ (జనసేన నేత)



మచిలీపట్నం టౌన్ : ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాల్లో ఒకటైన పత్రికారంగం పట్ల గౌరవించేవారెవరు విలేఖరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు పాల్పడరు. ఫోటోలు తీస్తున్న విలేఖరులపై దాడులు జరపడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయింది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి సిగ్గుమాలిన చర్య.

వినాశకాలే విపరీత బుద్ధి

- బండ్రెడ్డి రామకృష్ణ (జనసేన నేత)



వైసీపీ నాయకులకు వినాశకాలం వచ్చింది. విపరీత బుద్ధితో రాప్తాడు వద్ద ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిపారు. ఈ దాడికి బాధ్యులైన కార్యకర్తలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దాడులు పునరావృతమైతే జనసేన పక్షాన ఉద్యమిస్తాం.

ఏనాడూ ఇలాంటి సంఘటనలు చూడలేదు

- బూరగడ్డ వేదవ్యాస్ (మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా.. ఇలా విలేఖరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులు ఏనాడూ చూడలేదు. రాజకీయ పార్టీలు ఏవైనా చెప్పవలసి వస్తే ఖండిస్తూ ప్రకటనలు ఇవ్వవచ్చు.. దాడులు జరపడం అమానుషం. ఈ దాడులను ముక్తకంఠంతో ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి. ఈ దాడుల వెనుక ఉన్న వారిని కూడా అరెస్టు చేయాలి. సీఎం జగన్ ఒక మీడియా సంస్థకు అధినేతగా ఉంటూ వైసీపీ కార్యకర్తలు దాడులు జరుపుతుంటే ఏమి మాట్లాడటం లేదు. పాత్రికేయుల సంక్షేమం కోసం పదవుల్లో ఉన్న వారెవరు పెదవి విప్పడం లేదు.

అరాచకాన్ని ప్రోత్సహిస్తున్న సీఎం జగన్

- వీరంకి వెంకట గురుమూర్తి (టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి)



తోట్లవల్లూరు : సిద్ధం అని.. సీఎం జగన్ చొక్కాలు మడతేయండంటూ అరాచకశక్తులను తయారు చేస్తున్నారు. ఆయన పాల్గొన్న సభలోనే ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు అమానుషదాడి చేయటం ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ. రాష్ట్ర చరిత్రలో ఏ సీఎం ఇలా ప్రవర్తించలేదు. జగన్ పత్రికలో నిత్యం టీడీపీ నేతలపై ఎన్నో అసత్యవార్తలు రాస్తున్నా ఎక్కడైనా టీడీపీ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడలేదు. దాడికి గురైన ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ బీసీ వర్గానికి చెందిన వాడు.. తక్షణమే సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి.

అరాచకాలు బయటపెడతారనే..

- కాగిత కృష్ణప్రసాద్ (పెడన టీడీపీ ఇన్‌చార్జి)

బంటుమిల్లి : వైసిపి దోపిడీలు, అరచకాలు, బయటపెడతారనే ఉద్దేశంతో ప్రతికా విలేఖరులపై దాడి చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై దాడి చేయడం అవమానకరం. శ్రీకృష్ణ కుటుంబాన్ని ఆదుకుని.. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి దోషులను వెంటనే శిక్షించాలి.

ఆటవిక చర్య..

- కొలికపూడి శ్రీనివాసరావు (అమరావతి ఉద్యమనేత)



విస్సన్నపేట: రప్తాడు సభలో సీఎం జగన్ రెడ్డి మాట్లాడుతుండగా వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అమానుషంగా దాడి చేయడం ఆటవిక చర్య. వైసీపీ ములకు వీధి రౌడీల్లా వ్యవహించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందనేందుకు మీడియాపై దాడే నిదర్శనం.

జగన్‌కు పోయేకాలం దగ్గర పడే..

- నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట : జగన్‌కు పోయేకాలం దగ్గర పడే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై తన రౌడీ మూకలను ఉసిగొల్పి తన అక్కసును వెళ్లగక్కడాని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన తప్పొప్పులను ఎత్తి చూపే పత్రికల అంటే అక్కసు వెళ్లగక్కుతున్నాడని, ఆంధ్రజ్యోతిని అణిచి వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు

పత్రికల నోరు నొక్కితే ప్రజలు నీ పీక నొక్కుతారు : శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట : పత్రికలను, పాత్రికేయులను నిజాలు బయటకు రాకుండాబెదిరించటం, దాడులకు తెగబడితే ప్రజలు జగన్ పీక నొక్కుతారు. గతం నుంచి వేధిస్తు ఇబ్బందులు పెట్టినా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ దమ్ముగా నిలబడి ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది.

జగ్గయ్యపేటరూరల్ : ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసు కోవాలని రాష్ట్ర పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ నేత ముల్లంగి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

ప్రణాళికా బద్ధంగా ఎన్నికల నిర్వహణ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



జాతీయ ఎన్నికల నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : రానున్న ఎన్నికలు విజయవంతం కావడానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచించారు. విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో సోమవారం తూర్పు గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయి మాస్టర్ ట్రెయినర్లు కుముద్‌కుమార్ ఝా, జీఆర్ హరిశిల్పలు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్న సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. మాస్టర్ ట్రెయినర్‌లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మందికి శిక్షణా ఇచ్చారని, ప్రస్తుతం ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో 124 మంది ఏఆర్‌వోలకు శిక్షణా ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, నిబద్ధత అవగాహన ముఖ్యమని చెప్పారు. సంబంధిత అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సమన్వయం ముఖ్యమని, ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లను కలెక్టర్ సత్కరించారు.

మార్చి 3న పల్స్ పోలియో విజయవంతం చేయండి

వన్‌టౌన్ : మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేసేందుకు సమన్వయంతో సంబంధిత అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. సోమవారం వర్చువల్ విధానంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఐసీడీఎస్ కార్మిక శాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, మెప్మా, ఆర్టీసీ, రైల్వే తదితర విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయిలో పెద్దఎత్తున మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో 2,48,868 మంది ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లలున్నారని చెప్పారు. మొత్తం 1008 బూత్‌లతో పాటు 34 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకొని పోలియో చుక్కలను వేయాలన్నారు. పోలియో చుక్కల కార్యక్రమంపై వివిధ మార్గాల ద్వారా తల్లితండ్రులకు అవగాహనా కల్పించాలన్నారు. రైల్వే స్టేషన్, బస్సుస్టేషన్ తదితర చోట్ల కూడా పాయింట్లు ఏర్పాటు చేయాలని హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. సుహాసిని, జిల్లా ఇమ్యూనిజైషన్ అధికారిణి డాక్టర్ అమృత, జిల్లా ఎయిడ్స్ లెప్రసీ, టీబీ అధికారిణి డాక్టర్ జే. ఉషారాణి, డీపీఎంవో డాక్టర్ పి.నవీన్, జిల్లా పాఠశాల విద్యాధికారి యు.వి సుబ్బారావు, స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి జి. ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు బుక్ కీపర్ వేధింపులు!

» లంచం ఇస్తేనే లోన్ మంజూరు చేయిస్తానని హుకుం

» అవనిగడ్డలో డ్వాక్రా మహిళల ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 19 : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన షాలేమ్ డ్వాక్రా గ్రూపు సభ్యులకు లోన్లు మంజూరు కానివ్వకుండా గ్రూప్‌కి చెందిన బుక్ కీపర్ రత్నకుమారి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని గ్రూపు సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అవనిగడ్డ స్టేట్ బ్యాంక్‌లో షాలేమ్ డ్వాక్రా గ్రూపు గత కొన్నేళ్లుగా లోన్లు తీసుకుంటూ, డబ్బులు కడుతూ వస్తున్నామని, ప్రస్తుతం తమ గ్రూప్‌కి 3 లక్షలు మాత్రమే అప్పు ఉందని, కొత్తగా అప్పు కోసం బ్యాంక్ వారిని సంప్రదిస్తే లోన్ మంజూరు చేయటానికి అంగీకారం తెలిపిన తర్వాత బుక్ కీపర్ రత్నకుమారి తమకు లోను ఇవ్వకుండా అడ్డుపడుతోందని, లంచం ఇస్తేనే తమకు లోన్ మంజూరు చేయనిస్తానని ఖరాకండిగా చెప్పిందని గ్రూపు సభ్యులు ఆరోపించారు. బుక్‌కీపర్‌పై ఫిర్యాదు చేసేందుకు వెలుగు సీసీ, ఏసీల వద్దకు వెళితే సీసీ సువర్ణ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ చేయిస్తేనే లోను మంజూరు చేస్తామని అన్నారన్నారు. ఏసీ రవికుమార్ మహిళలు అని కూడా చూడకుండా అసభ్యపదజాలం ఉపయోగిస్తూ మాట్లాడుతున్నారన్నారు. తమ గ్రూప్ కంటే ఎక్కువ రుణాలు చెల్లించాల్సిన గ్రూపులకు సైతం డబ్బులు ఇస్తే కొత్త లోన్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే వెలుగు ఏసీ, సీసీ, బుక్ కీపర్‌లను విధుల నుంచి సస్పెండ్ చేసి షాలేమ్ గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. షాలేమ్ గ్రూపు సభ్యులకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. అయితే దీనిపై వెలుగు సిబ్బంది వాదన వేరుగా ఉంది. షాలేమ్ గ్రూపునకు నాలుగున్నర లక్షలకు పైగా లోన్ అవుట్ స్టాండింగ్ ఉందని, లోన్ అవుట్ స్టాండింగ్ ఉన్న వారికి కొత్త లోను ఇవ్వటం సాధ్యపడదని చెబితే బుక్ కీపర్‌పైన, సిబ్బందిపైన గ్రూపు సభ్యులు దుర్భాలాడుతూ అసత్య ప్రచారానికి దిగారని ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్, సీసీ సువర్ణకుమారిలు తెలిపారు. రాజకీయ కారణాలతోనే తమపై షాలేమ్ గ్రూపు సభ్యులు ఆరోపణలు చేస్తున్నారని, లోన్ మంజూరు కోసం తాము ఎవరి వద్ద లంచం తీసుకోలేదని బుక్ కీపర్ చింతా రత్నకుమారి సోమవారం వెలుగు కార్యాలయంలో వివరణ ఇచ్చారు.

రాప్తాడు ఘటనపై చర్యలు తీసుకోండి

» కలెక్టర్ రాజాబాబుకు విలేకరుల వినతి

మచిలీపట్నం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ మచిలీపట్నం విలేకరులు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో కలెక్టర్ పి రాజాబాబుకు వినతిపత్రం అందించారు. పత్రికావిలేకరులు. ఫొటోగ్రాఫర్లపై అధికారపక్ష నాయకులు, కార్యకర్తలు ఇటీవల కాలంలో తరచూ దాడులు చేస్తున్నారని విలేకరులు అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.



భీమవరంలో ఉద్రిక్త పరిస్థితి

తిరుపతమ్మ భక్తులపై పోలీసు జులుం

» భీమవరం గ్రామంలో ఉద్రిక్తత

వత్సవాయి, ఫిబ్రవరి 19 : రంగుల మహోత్సవం పూర్తిచేసుకుని జగ్గయ్య పేట నుంచి పెనుగంచిప్రోలు బయల్దేరిన అమ్మవారి మండలంలో భీమవరం గ్రామానికి సోమవారం ఉదయం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు అనంతరం అంకమ్మ గుడి దగ్గర భక్తులు సందర్శనార్థం కొద్ది సేపు ఉంచారు. ప్రతిసారి 3-4 గంటలు ఉంచి గ్రామస్తులు అంతా దర్శనం, పూజలు అయ్యాక లింగగూడెంకు తీసుకువెళ్లేవారు. ఈ సారి కొద్ది సేపు ఉంచి తీసుకెళ్లేందుకు అధికారులు సిద్ధం కావటంతో గ్రామస్తులు పల్లకీలకు అడ్డం తిరిగారు. ఈ సందర్భంగా పోలీసులు భక్తులపై చేయి చేసుకుని బలవంతంగా లాగి పారేయ్యటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భక్తులపై పోలీసులు దాష్టికాన్ని గ్రామస్తులు తీవ్రంగా నిరసించారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పటంతో అమ్మవారి యాత్ర సాగింది.

కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు రేపు

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు జరుగుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ బీవీఎస్ఆర్ మూర్తి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. స్వయం ఉపాధి ప్రతిపాదికన కు టుంబ ఆధారిత వ్యాపారాల్లో నిమగ్నమైన చేతివృతిదారుల కోసం ఈ అవగాహన సదస్సు జరుగుతోందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో లబ్ధి పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	298
చికెన్ స్కిన్‌లెస్	308

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

ముస్తాబాద మద్యం దుకాణం వద్ద ఇరువర్గాల దాడి

గన్నవరం, ఫిబ్రవరి 19 : మండలంలోని ముస్తాబాద ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో పలువురికి గాయాలైనట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. విజయవాడ మధురానగర్‌కు చెందిన యువకులు మద్యం షాపు దగ్గర ఉండగా ముస్తాబాదకు చెందిన యువకుడు సిగిరెట్ అడగడంతో వివాదం మొదలైంది. మాటా మాటా పెరగడంతో మధురానగర్ చెందిన యువకుడిని కొట్టగా అతనితో పాటు వచ్చిన మరో నలుగురు ముస్తాబాద వారిపై దాడికి దిగి కొట్టారు. దీంతో ఇరువర్గాల కొట్లాటలో మధురానగర్‌కు చెందిన వారికి గాయాలయ్యాయి. ఇరువర్గాల మీద కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

సైన్స్ రీసెర్చ్ సెంటరుగా ధనేకులకు గుర్తింపు

పెనమలూరు, ఫిబ్రవరి 19 : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగానికి రీసెర్చ్ సెంటరుగా గుర్తింపు లభించినట్లు కళాశాల ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ప్రస్తుత, వచ్చే విద్యా సంవత్సరానికి ఈ గుర్తింపును కాకినాడ జేఎన్‌టీయూ అందించినట్లు ఆయన తెలిపారు. దీనితో ధనేకుల అధ్యాపకులకు రీసెర్చ్ ద్వారా ప్రసిద్ధి చెందిన జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు సమర్పించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్ రవి ప్రసాద్, సెక్రటరీ భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, సౌమ్య అధ్యాపకులను అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ చిత్రపటం వద్ద కమిటీ సభ్యుల నివాళి

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 19 : విజయవాడ రూరల్ మండలం నున్నలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి ఘనంగా జరిగింది. హిందూ సమాజ పరిరక్షణ కమిటీ నున్న ఆధ్వర్యంలో స్థానిక చెరువు సెంటర్‌లో ఛత్రపతి శివాజీకి ఘన నివాళులర్పించారు. కమిటీ గ్రామ అధ్యక్షుడు మాదు నాగ గోవర్ధన్ శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో కార్యదర్శి ఆరేపల్లి శివ, వెంకటేశ్వరరావు, రత్నాకర్, మాదు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా విద్యాసాగర్

గన్నవరం, ఫిబ్రవరి 19 : ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా దేవరపల్లి విద్యాసాగర్ ఎన్నికైనట్లు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల భీమవరంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నిక చేసినట్లు చెప్పారు. గత 22 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేయటంతో పాటు ఎస్టీయూ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిట్లు తెలిపారు. సంఘ అభివృద్ధికి ఎంతో శ్రమించటం వల్ల తనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక చేశారని తెలిపారు. విద్యాసాగర్‌ను మండల అధ్యక్ష కార్యదర్శులను ఎం.ఆనంద్ కుమార్, ఆర్.ఆనంద్‌కుమార్‌లతో పాటు పలువురు అసోసియేషన్ నాయకులు అభినందించారు.

డయల్ యువర్ డీఎం నేడు

గన్నవరం, ఫిబ్రవరి 19 : స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం ఉదయం 11నుంచి 12గంటల వరకూ ఉంటుందని డిపో మేనేజర్ పి.శివాజీ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు వారి సలహాలు, సూచనలు, సమస్యలను 87909-96090నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

చెరకు ట్రక్కు బోల్తా - త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై పెద ఓగిరాల సమీపాన చెరకులోడుతో వెళుతున్న ట్రాక్టరు ట్రక్కు బోల్తాపడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. కంకిపాడు వైపు నుంచి సోమవారం ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారానికి చెరుకు లోడుతో వస్తున్న ట్రాక్టరు ట్రక్కు టైరు ఊడి పక్కకు ఒరిగి చెరుకు రోడ్డుపై అడ్డంగా పడింది.

పాఠశాల రికార్డులు పరిశీలించిన డీవైఈవో

గన్నవరం, ఫిబ్రవరి 19 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను డీవైఈవో రవిప్రకాష్ సోమవారం సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారు అని ఆరా తీశారు. ఉత్తీర్ణత నూరుశాతం సాధించాలన్నారు. ప్లస్ పీజీటీలతో ముఖాముఖి నిర్వహించారు. హెచ్ఎం ఎన్ఆర్ భవాని పాల్గొన్నారు.

టైగర్ పవర్ క్లబ్ విద్యార్థికి బంగారు పతకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 19 : జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించేలా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని సినీ నటుడు సుమన్ అన్నారు. బాపులపాడు మండలానికి చెందిన అలెన్ శామ్యూల్ హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచి బంగారుపతకం కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 4వ జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో 30 కేజీల విభాగంలో కుంగ్‌ఫూ కటాస్‌లో బంగారు పతకం, కరాటే క్రీడలో సిల్వర్ పతకం కైవసం చేసుకున్నాడని టైగర్ పవర్‌క్లబ్ అధినేత వర్రే అంజిబాబు వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సినీనటుడు సుమన్ చేతులమీదుగా పతకాలను, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని తెలిపారు.

విజయవాడకు తరలిరావాలి

గన్నవరం, ఫిబ్రవరి 19 : ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా జేఏసీ నేడు తలపెట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున గన్నవరం నుంచి తరలిరావాలని జేఏసీ ఛైర్మన్ వి.సాంబశివరావు అన్నారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో అసోసి యేషన్ భవనం నందు గన్నవరం తాలూకా యూనిట్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. నాయకులు మరీదు వరప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 19 : సైకో జగన్‌రెడ్డి పాలనలో వెనుకబడ్డ రాష్ట్ర పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సోమవారం పెనమలూరు మండలం గంగూరు సిద్దిక్‌నగర్ చేపల కుండీల కట్ట ఏరియాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్క ఛాన్సు పేరుతో అధికారం చేపట్టిన సైకో జగన్‌రెడ్డి నోటికొచ్చినట్లు అబద్దాలు ఆడుతూ, రాష్ట్ర ప్రజలను ఐదేళ్లుగా మోసం చేస్తున్నాడన్నారు. మద్యాన్ని పూర్తిగా నిషేధించి మళ్లీ ఓట్లడుగుతానని ఎన్నికలకు ముందు విర్రవీగిన జగన్‌రెడ్డి ఆ ఊసే మరిచాడన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను తోలివేసి అమరావతి, పోలవరం, పిల్లల భవిష్యత్తును నాశనం చేసిన సైకో జగన్‌రెడ్డికి తిరిగి ఓట్లు అడిగే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. రాష్ట్రానికి పట్టిన పీడ ఎప్పుడు వదులుతుందా అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, అబ్దుల్ సలాం, ఇర్ఫాన్, ప్రవీణ్, కోటయ్య, చండూరు శివ, కంచర్ల శేఖర్, వేమూరి వెంకటేశ్వరరావు, జయరాజు, చారి, డాక్టర్ శివ, మట్టా సురేష్, అబ్దుల్ గౌస్, కొండా ప్రవీణ్ పాల్గొన్నారు.



గంగూరు సిద్దిక్‌నగర్ చేపల కుండీల కట్ట ఏరియాలో పార్టీ మేనిఫెస్టో వివరిస్తున్న బోడె ప్రసాద్

యనమలకుదురు, కానూరులో..

యనమలకుదురు, కానూరు గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె సతీమణి హేమ, తనయుడు వెంకట్రాం, జనసేన నాయకులు తాతపూడి గణేష్, మాదాసు రాము పాల్గొని స్థానికులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, బలగం కొండ, తమ్ము అశోక్, మల్లంపాటి విజయలక్ష్మి, వెలగపూడి సబిత, బలగం నాగరాజు, టీడీపీ రెహమాన్, అంగిరేకుల మురళి, రియాజ్, సమీర్, కోసూరి రమేష్, సింగం సుబ్రహ్మణ్యం, బెజవాడ వెంకటేష్, వెలగపూడి రాజశేఖర్, తాడిశెట్టి వీరాస్వామి, కిలారు శ్రీనివాస్, ధనేకుల షణ్ముఖరావు, షేక్ షకీలా, హసీనా తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో బోడె హేమ

వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరం, ఫిబ్రవరి 19 : మండలంలోని సూరంపల్లి సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా సోమవారం జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో గణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర, పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత సీతారామ చంద్రస్వామి విగ్రహాలను రుత్విక్కుల వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠ జరిపారు. నిర్ణీత సమయానికి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీకి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. సావరగూడెం ఆలయ అభివృద్ధికి రూ. 1,01,116 అందజేశారు. ఆలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 10 వేల మందికి అన్నదానం చేశారు.



సూరంపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం పూజలు చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

పరిశ్రమలు తేలేక బాబుపై అసత్య ఆరోపణలు

గన్నవరం, ఫిబ్రవరి 19 : రాష్ట్రానికి నూతన ప్రరిశ్రమలు తేలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై సీఎం జగన్ అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ (సూర్యం) అన్నారు. జగన్ ఆరోపణలను ఖండిస్తూ గన్నవరం హెచ్‌సీఎల్ వద్ద టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన హెచ్‌సీఎల్ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ టు జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి ఏపీకి కొత్త పరిశ్రమలను తేకపోగా ఉన్నవాటిని తరిమేస్తున్నారని మండిపడ్డారు

ఉయ్యూరులో కోర్టు నిర్మాణానికి సహకారం

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 : ఉయ్యూరులో జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు అవసరమైన భూమి కేటాయించి భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ హామీ ఇచ్చారు. ఉయ్యూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నేషనల్ లాడ్జి కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్, ఉపాధ్యక్షుడు పల్లె అశోక్‌కుమార్, వసుధారాణి, శ్రీకృష్ణకుమార్, ప్రసాదరావు, సూర్యనారాయణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి హేయం

జంక్షన్‌లో ఏపీయూడబ్ల్యూజే నిరసన ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడు వైసీపీ సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం జంక్షన్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించారు. జంక్షన్‌లోని నాలుగు రోడ్లలో ప్రదర్శన అనంతరం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్ది సేపు ధర్నా నిర్వహించి, డీటీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రొంపెల్లి అచ్యుతరావు, జంక్షన్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కె. బాలస్వామి, ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, వివిధ పత్రికా విలేకరులు మేడేపూడి వెంకటేశ్వరరావు, అంకమబాబు, సీహెచ్ శ్రీనివాసరావు, కరీం, రవి, కిరణ్, రమేష్, పవన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బాపులపాడు డీటీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కంకిపాడు : ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడి పత్రిక స్వేచ్ఛపై దాడి అని దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, అనంతపురంలో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించ టమే అన్నారు. చిన్నపాటి ఉద్యో గాలు చేసుకునే ఇటువంటి వారిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



హరికృష్ణ

ఉయ్యూరు : రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిపట్ల సర్వత్ర నిరసన వ్యక్తమవుతుంది. సిద్ధం సభలో శ్రీకృష్ణపై దాడిచేసి తీవ్రంగా గాయపరచడం పట్ల పలువురు నాయకులు ప్రతిస్పందించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల పైనా వైసీపీ మూకల దాడులు పెరగగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా నిలిచే జర్నలిస్టులపై దాడిచేయడం ప్రజాస్వామ్యానికే మచ్చఅని ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్ అభిప్రాయపడ్డారు.



వసంతకుమార్

శాస్త్రీయ విద్యావిధానాన్ని అలవాటు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 19 : ప్రతి విద్యార్థి శాస్త్రీయ విద్యావిధానాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మంచి పట్టు సాధించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్వర్ణశిల్పి కీర్తిశేషులు పెట్ల సత్యనారాయణ మూర్తి లక్ష్మీనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం స్థాపించిన పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ (కొండపల్లి) ఆధ్వర్యంలో తేలప్రోలు పరిధిలోని పాఠశాలలు, కళాశా లల్లో 2022-23 విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల్లో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించే కార్యక్రమం సోమవారం తేలప్రోలులోని భీమవరపు కృష్ణమోహన రెడ్డి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. 40మంది విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఉయ్యూరు సాంబిరెడ్డి, ఉషారామా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఏ.మదనమోహనరావు, సర్పంచ్ లాం దిబోర, ఎంఈవో-2 జె.సాంబశివరావు, ట్రస్ట్ అధ్యక్షుడు పెట్ల కామేశ్వరరావు, భీమవరపు సుబ్బారెడ్డి, అబ్బూరి రామ్మూర్తి, ముత్తారెడ్డి, భాను సుందరకుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 19 : మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగకరమైన క్రీడలపై గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత ఆసక్తిని పెంపొందించుకోవాలని, అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకుడు యనమదల సుధాకరరావు అన్నారు. రేమల్లె వాలీబాల్ టీం ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లాస్థాయిలో తృతీయస్థానం సాధించడంతో గ్రామస్తుల సమక్షంలో అభినందన కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, కార్యదర్శి గుడివాడ విజయానంద్, తుమ్మల మధు, సొదిమెళ్ల ప్రదీప్, తొమ్మండ్రు మహేష్, కలపాల కుమార్, వడ్లమూడి జానకీరామ్మూర్తి, కొల్లూరు చంద్రకాంత్ పాల్గొన్నారు.

పంప్‌హౌస్ ట్యాంకులో పడి ఇద్దరికి గాయాలు

గన్నవరం, ఫిబ్రవరి 19 : మండలంలోని దావాజీగూడెం ఏలూరు కాలువ వంతెన వద్ద ఉన్న పంపు హౌస్‌లో ప్రమాదవశాత్తు పడి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కారంపూడి సాంబశివరావు, మద్దినేని సత్యనారాయణలు బుద్ధవరంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠకు వెళ్ళి ఏలూరు కాలువ గట్టునే ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఏలూరు కాలువ వంతెన వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు పంపుహౌస్‌కు సంబంధించిన ట్యాంకులో పడిపోయింది. హుటాహుటిన స్థానికులు తాళ్లతో ఆ ఇద్దరిని పైకి లాగి విజయవాడ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ పరామర్శించి మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు.

రూ.1.50 లక్షల విలువైన బంగారం చోరీ

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 19: విజయవాడ రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారు అభరణాలు చోరీ చేసిన సంఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నెక్కంటి వారి వీధిలో నివాసం ఉండే భీమవరపు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంటికి తాళం వేసి ఉండగా సోమవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దోచు కుపోయారు. బాధితుడి ఇంటి సమీపంలోని అలజంగి మునీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

కత్తెరతో గాయపరిచిన వ్యక్తి అరెస్టు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 19: ఇంటి ముందు ఎర్రనీళ్లు పోసాడనే విషయంపై వివాదానికి దిగిన ఇరువురిపై హెయిర్ సెలూన్‌లో వాడే కత్తెరతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని సోమవారం జంక్షన్ పోలీసులు అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరు పరిచారు. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాలు ప్రకారం వేలేరు గ్రామంలో ఆదివారం అమీర్ జానీ ఇంటి వైపు అదే గ్రామానికి చెందిన ఆకునూరి రాజేష్ తో ఎర్రనీళ్లు పోసాడనే కారణంతో వివాదానికి దిగాడు. ఇరువురు మధ్య ఘర్షణ పెరిగిన నేపథ్యంలో రాజేష్ హెయిర్ సెలూన్‌లో వాడే కత్తెరతో దాడి చేసి జానీతో పాటు అతని సమీప బంధువు ఎండీ కరిముల్లాను గాయపరిచాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ శ్రీవేద పర్యవేక్షణలో నిందితుడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	298
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

ఆర్టీసీ బస్సు ఢీకొని తాపీమేస్త్రి దుర్మరణం



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మన్నే ఆంజనేయులు (50) దుర్మరణం చెందాడు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి సైకిల్‌పై ఆదర్శనగర్‌కు వెళుతుండగా మన్నే ఆంజనేయులును నరసాపురం డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆంజనేయులు బస్సు వెనుక టైరు కింద పడిపోయాడు. స్థానికులు 108కు ఫోన్ చేసినా ఎంతసేపటికీ రాకపోవడంతో ఆటోలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆంజనేయులు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు చిలకలపూడి హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేతలకు ముడుపులందకే ఎన్‌వోసీ ఇవ్వడం లేదు : టీడీపీ ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : యూనియన్ బ్యాంకు నుంచి ముడుపులు అంది ఉంటే పట్టాభి స్మారక భవనం నిర్మించేందుకు వైసీపీ పాలకులు అనుమతులు ఇచ్చేవారని టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి , చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి రాము, అన్నం ఆనంద్‌లు , దేవరపల్లి అనిత విమర్శించారు. అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వివేకానంద మందిరంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో సభా మర్యాదలు పాటించకుండా వైసీపీ కార్పొరేటర్ పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రచురించిన కరపత్రాలను చించి వేయడం దారుణమన్నారు. మేయర్‌కు వినతి పత్రం ఇచ్చిన ఫోటోలను మీడియాకు టీడీపీ కార్పొరేటర్లు చూపించారు.

అజెండాలో 40 అంశాలపై టీడీపీ నిరసన



మచిలీపట్నం టౌన్: శనివారం జరిగిన నగర పాలక సంస్థ అత్యవసర సమావేశం టేబుల్ అజెండాలో 40 అంశాలను పెట్టడంపై టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. కలెక్టరేట్ వద్ద టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. నగర పాలక సంస్థ పాలకులు ఇష్టారాజ్యంగా టేబుల్ అజెండాలో ఒకేసారి 40 అంశాలను ప్రవేశపెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిపై డిసెంట్ తెలుపుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జాహ్నవి



నాగాయలంక : కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-16 కబడ్డీ జిల్లా జట్టుకు నాగాయలంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొక్కిలిగడ్డ జాహ్నవి ఎంపికైంది. సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం కె.శాంతకుమారి తెలిపారు. జాహ్నవిని పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

ఆలయ కల్యాణ మండపానికి శంకుస్థాపన



ఘంటసాల : శ్రీకాకుళం కోదండ రామస్వామి ఆలయంలోని కల్యాణ మండపం నిర్మాణం నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), మండల టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ముదిరాజ్ సంఘ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి వ్యాఖ్యలకు నిరసన



నాగాయలంక : టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుపై ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మత్స్యకార సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. ద్వారంపూడి వ్యాఖ్యలను సోమవారం మత్స్య భవనం వద్ద ఖండిస్తూ నిరసన తెలియజేశారు. ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ మత్స్యకార జాతికి తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షులు కర్రి కృష్ణమూర్తి, వివిధ సంఘాల ప్రతినిధులు నాగిడి పోతురాజు, సైకం విజయభాస్కర్, వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

జాతీయ రెల్లి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనాల



గుడివాడ : రెల్లి కులాల జాతీయ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనాల రేణుక పణీంద్ర నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన జాతీయ రెల్లి ఎస్సీ గ్రూపు కులాల సంక్షేమ సంఘ సమావేశంలో జాతీయ అధ్యక్షుడుభూపతి అప్పారావు నియామకపత్రాన్ని ధనాలకు అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సొసైటీ సాయం



చల్లపల్లి : మాజేరు సొసైటీలో సభ్యత్వంలో కలిగి ఇటీవల మృతిచెందిన మాజేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ రామలింగయ్య (85) కుటుంబానికి సొసైటీ తరఫున రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆయన కుమారులకు సొసైటీ ఛైర్‌పర్సన్ అరజా శివశంకర్ అందజేశారు. సీఈవో ఎస్.ఎస్.చక్రపాణి, పర్సన్‌లు నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అంతర్వేది మహాగజమాల యాత్ర ప్రారంభం



బంటుమిల్లి : చోరంపూడి రామాలయంలో అంతర్వేది మహాగజమాల యాత్రను అగ్నికుల క్షత్రియ పల్లవ వంశస్థుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కుమారుడు కొల్లు పునీత్, పలు ప్రాంతాల అగ్నికుల క్షత్రియులు పాల్గొన్నారు. సర్పంచ్ రేవు గోపాలకృష్ణ, ఒడుగు తులసీరావు, మాజేటిశ్రీనివాసరావు, తదిరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌తో ప్రజల్లోకి పాపారావు



నాగాయలంక : జనసేన నేత చిలకలపూడి పాపారావు నాగాయలంక ప్రధాన సెంటర్‌లో మార్నింగ్ వాక్‌తో ప్రజలతో మమేకమవుతున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరుతున్నారు. ప్రజల్లోకి జనసేన పార్టీని బలంగా తీసుకుని వెళ్తున్నట్లు పాపారావు తెలిపారు.



మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో మండలి బుద్ధప్రసాద్



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న వెనిగండ్ల



కపిలేశ్వరపురం పల్లెబాటలో వర్ల కుమార్ రాజా

యువత తొలి ఓటు చంద్రబాబుకు వేయాలి

● మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో బుద్ధప్రసాద్ పిలుపు

అవనిగడ్డ, ఫిబ్రవరి 19 : రాష్ట్రాభివృద్ధికి పాటుపడే నేతను గుర్తించి, ఆలోచించి ఓటు హక్కు పొందిన యువత సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం అవనిగడ్డలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువత తొలి సారిగా వేసే ఓటు దేశ, రాష్ట్ర గతిని మార్చేదిగా ఉండాలన్నారు. దేశ, రాష్ట్ర గతిని మార్చగల నేత చంద్రబాబు మాత్రమేనని బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్నో ఐటీ కంపెనీలు ప్రారంభించి యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు కృషి చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కంపెనీలను తరిమివేశారన్నారు. టీడీపీ నాయకులు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, రావి రత్నగిరి, మోర్ల శివ, మద్దూరి కాంతారావు, బండే నాగ వెంకట కనకదుర్గ, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, మేడికొండ విజయ్, దివి యుగంధరి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ సోషల్ మీడియాలో చొరవ చూపుతున్న కార్యకర్తలను బుద్ధప్రసాద్ సత్కరించారు. చంద్రబాబు నాయుడికే ఎందుకు ఓటు వేయాలి అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు.

కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ ఎమ్మెల్యే కొడాలి విఫలం

గుడివాడ : ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించడంలో ఎమ్మెల్యే కొడాలి నాని విఫలమయ్యాడని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము దుయ్యబట్టారు. సోమవారం గుడివాడలోని 4, 25 వార్డుల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులతో కలిసి ఆయా వార్డుల్లో పర్యటించారు. వెనిగండ్ల మాట్లాడుతూ, రోడ్ల అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు మురుగు కాల్వల పరిస్థితి ఘోరంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల వేళ వైసీపీలో గుడివాడ అభ్యర్థి ఎవరో అయోమయస్థితి నెలకొందని విమర్శించారు. నలుగురు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. చింతల కాల్వ డ్రయిన్ డ్రైన్ దుస్థితిపై వెనిగండ్ల సెల్ఫీ చాలెంజ్ విసిరారు. కాకరాల సురేష్, సాంబశివరావు, వసంతవాడ దుర్గారావు, లింగం ప్రసాద్, యార్లగడ్డ సుధారాణి, మేరుగు మోజెస్, శొంఠి రామకృష్ణ, సయ్యద్ జబీన్, సూరిబాబు, కోడూరి ప్రభు, పొట్లూరి రమాదేవి, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, గడ్డం ప్రకాష్‌దాసు, అందుగుల ఏసుపాదం, బాలసాని భవానిశంకర్, కొడాలి బాలు, రెడ్డి రాజు, కొడాలి వేణుగోపాలస్వామి, మజ్జి శ్రీనివాసరావు, ఇంటూరి గజేంద్ర, గునుకుల వినోద్‌కుమార్, నిల్లా సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు దోచుకోవడంపైనే శ్రద్ధ : కుమార్‌రాజా

కపిలేశ్వరపురం (పమిడిముక్కల) : వైసీపీ నాయకులు దోచుకుని దాచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజ ఆరోపించారు. నియోజకవర్గంలో 15వ రోజు పల్లెబాటలో భాగంగా సోమవారం కపిలేశ్వరపురంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీ డీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, లింగమనేని బాబూరావు, కొల్లిపర బాబి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ రమేశ్, రాజులపాటి శ్రీనివాస్, కంచర్ల సురేశ్, జనసే నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో వైసీపీ నుంచి పది కుంటుంబాలు టీడీపీలో చేరాయి. కండువా కప్పి వర్ల కుమార్ రాజా స్వాగతం పలికారు.

బందరు డీఎస్పీ సుభాన్ బాధ్యతల స్వీకారం



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ సుభాన్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : మచిలీపట్నం డీఎస్పీగా మహమ్మద్ అబ్దుల్ సుభాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుభాన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమ వారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మీని మర్యాద పూర్వకంగా కలిశారు.



చిన ఆకులమన్నాడులో రామాలయ ప్రతిష్ఠ



చినపారుపూడిలో శ్రీకృష్ణుడి సేవలో ఎమ్మెల్యే



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ధ్వజ ప్రతిష్ఠ

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : గూడూరు మండలం చిన ఆకులమన్నాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగాయి. బొమ్ము రాఘవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవంలో సంగా మధుసూదనరావు, గుంటుపల్లి రంగనాయకులు, నూకల రాంబాబు, లంకిశెట్టి బాలాజీ, బొమ్ము ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చినపారుపూడిలో శ్రీకృష్ణుడి విగ్రహం

పెదపారుపూడి : చినపారుపూడిలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామి వారికి శాంతి కల్యాణాన్ని గ్రామస్థులు జరిపారు. హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పాల్గొని శ్రీ కృష్ణుడిని ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

చల్లపల్లి : విజయవాడరోడ్‌లో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామి వారి 46వ వార్షిక కల్యాణమహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. కలశప్రతిష్ఠ, అఖండజ్యోతి, ధ్వజారోహణ, అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. వేదపండితులు కొండిపర్తి లీలా జయకృష్ణమా చార్యుల నేతృత్వంలో పండితులు దంపతులచేత కల్యాణోత్సవాన్ని జరిపించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ పెద్దలు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్ బాబు, అడ్డాడ ప్రసాద్‌బాబు, డోలా శ్రీనివాసరావు, అడ్డాడ వెంకటేశ్వరరావు, అయ్యంకి నాగబ్రహ్మాచారి, సుబ్బయ్య, రవీంద్రబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విశేష అలంకరణ చేశారు. సుమారు రెండువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు

నేటి నుంచి అష్టలక్ష్మి ఆలయం 12వ వార్షిక మహోత్సవాలు

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడు గ్రామ పరిధిలోనిఅష్ట లక్ష్మీ దేవాలయం 12వ వార్షిక మహోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి జరుగుతాయని గ్రామ ప్రముఖుడు బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 20వ తేదీ మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహ ణ, మహాలక్ష్మి అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్నపన జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు లక్ష్మీనారాయణ స్వా మి శాంతి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 21వ తేదీ ఉదయం 11 గంటలకు దత్త విజయానంద తీర్థ స్వామి కరకములతో వైకుంఠ విష్ణు పార్షాద హోమం, మహాపూర్ణాహుతి, బ్రహ్మ కలశాభిషేకం, సాయంత్రం 6 గంటలకు స్వాగత సభ, శ్రీ చక్రార్చన, 22వ తేదీన ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.

తాండవకృష్ణకు సైకిల్ లోగో బహూకరణ



తాండవ కృష్ణకు సైకిల్ లోగో అందజేస్తున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ : మన టీడీపీ యాప్‌లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ప్రథమ స్థానం సాధించిన మోపిదేవి మండలం శివరామపురం గ్రామానికి చెందిన పిడికిటి తాండవ కృష్ణకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్ర సాద్ సైకిల్ లోగో బహూకరించారు. టీడీపీ యాప్‌ను చేరువ చేయటంలో తాండవ కృష్ణ చూపిన చొరవను అభినందిస్తూ రాష్ట్ర పార్టీ సైకిల్ లోగోను బహుమతిగా పంపగా, బుద్ధప్రసాద్ చేతులమీదుగా లోగోను తాండవ కృష్ణకు అందజేశారు. టీడీపీ నాయకులు మండలి వెంకట్రామ్, మెడబలిమి మల్లిఖార్జునరావు, బండే శ్రీనివాసరావు, నడకుదుటి జనార్దనరావు మోర్ల రాంబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, రావి రత్నగిరి, ఏసుబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అడుగుదాం ఆంధ్రా విజయవంతం చేయాలి

గుడివాడ : తెలుగు యువత ఆధ్వర్యంలో ఈనెల 25న ఉయ్యూరులో నిర్వహించే అడుగుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము కోరారు. అడుగుదాం ఆంధ్రా బహిరంగ సభ వాల్‌పోస్టర్లను వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, నియోజకవర్గ అధ్యక్షుడు గోవాడ శివ, ప్రధాన కార్యదర్శి నున్న పృధ్వితేజ్, పట్టణ, రూరల్, గుడ్లవల్లేరు, నందివాడ మండలాధ్యక్షులు రెడ్డి షణ్ముఖ్, కర్రె వెంకటగిరి, అట్లూరి స్వరూప్. పంది దుర్గారావు, యువత పాల్గొన్నారు.

విశ్వాసులకు క్రీస్తు మేలు చేస్తాడు : కాగిత

పెడన : తనపై నమ్మకం ఉంచిన వారికి ఏసుక్రీస్తు తప్పక మేలు చేస్తారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బ్రహ్మపురంలోని బెతస్థ చర్చి ఫాదర్ జాన్ విల్సన్ దేవుని సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, దేవుని వాక్యం అనుసరించిన ఎంతో మంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. 25 సంవత్సరాల పాటు సేవలందించిన పాస్టర్ జాన్‌విల్సన్ జీవితం ధన్యమైందని ఆయన ప్రశంసించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, మాజీ కౌన్సిలర్ యర్రా నాగరాజు, 19వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి పరసా జితేంద్ర, బ్రదర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కైలే భూమిపూజ

పామర్రు : మండల పరిధిలోని ఉరుటూరు నుంచి యాదవపురం వరకు నాగులేరు కట్టపై రూ. 4కోట్ల నిధులతో నిర్మించే రహదారి పనులకు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. పలువురు అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సీటుపై దుష్ప్రచారం చేస్తున్నారు : ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు : తనకు సీటు లేదని కొందరు చేసే దుష్ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) అన్నారు. డోకిపర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్య క్రమాల్లో నాని పాలొన్నారు. కుట్రలు కుతంత్రాల్లో భాగంగానే గుడివాడలో తనకు, గన్నవరంలో వంశీకి సీటు లేదని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు దమ్ముంటే ఎస్సీ ఎస్టీలకు సీట్లను ఇవ్వాలనీ సవాల్ విసిరారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కోడూరు : ఎస్సై పి.శిరీష వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన కోసూరు రాజారావు నివాసం వద్ద అక్రమంగా నిల్వ ఉన్న ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

పెదపారుపూడి : జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ కళాజాతానిర్వహించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ఏఆర్‌టీ మందులు వాడాలని తెలిపారు. బృందం సభ్యులు శేఖర్‌బాబు, చిరంజీవి, వీరయ్య, రవితేజ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల బాధ్యత బీఎల్వోలదే

పెడన : పోలింగ్ బూత్‌లలో అన్ని సదుపాయాలు ఉండేలా చూసే బాధ్యత బీఎల్వోలదేనని డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అన్నారు. ఎక్కడైనా పోలింగ్ బూత్‌లలో సదుపాయాలు సక్రమంగా లేకపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఎంపీడీవో రెడ్డియ్య, ఎన్నికల డీటీ కల్పన, ఆర్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

జూపూడి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

మచిలీపట్నం టౌన్ : అంబేద్కర్ కన్నా డబ్బులే ముఖ్యమని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు అనిత, బాలాజీ, గుమ్మడి విద్యాసాగర్, ఎస్. వసంతకుమారి డిమాండ్ చేశారు.